హామీలన్నీ అటకెక్కించేశారు!

గత ఎన్నికల్లో కూటమి నాయకులు అధికారమే పరమావధిగా గెలుపు కోసం అలవి కాని హామీలన్నింటిని ప్రజలపై గుప్పించారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్టుగా అధికార పీఠం చేజిక్కాక హామీల ఊసెత్తడమే మానివేశారు. ఏదైనా అడిగితే గత ప్రభుత్వం సర్వనాశనం చేసిందంటూ నిందలు వేసి చేతులు దులుపుకొంటున్నారు. కూటమిపై కోటి ఆశలు పెట్టుకున్న ప్రజానీకం నిరాశా నిస్పృహలతో ఉసూరుమంటున్నారు.

హామీలన్నీ నీటిమూటలే!

- పోర్టుకు అనుబంధ పరిశ్రమలతో ఉపాధి ఏమైంది?
- కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి చర్యలేవి?
- టెక్స్‌టైల్ పార్కు ఎక్కడ?
- ఎన్నికల్లో కాగిత ఇచ్చిన హామీల వైపుగా పడని అడుగులు

పెడన: బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ అభ్యర్థి పెడన అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల దిశగా అడుగులు పడటం లేదు. అధికారంలోకి వచ్చి నేటికి వందరోజులు కావస్తోంది. ఎన్నికలకు ముందు ఏప్రిల్ 17న పెడన బహిరంగ సభ పెట్టి అప్పటి ప్రభుత్వాన్ని టీడీపీ అధినాయకుడు ఎండగట్టారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల అమలుకు చర్యలు చేపట్టకపోగా ఖజానాలో డబ్బుల్లేవంటూ చేతులు ఎత్తేస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలకే దిక్కు లేదు..ఇక నియోజకవర్గ స్థాయిలో ఇచ్చిన హామీలకు నిధులేం సమకూర్చుతారు, ఏం అభివృద్ధి చేస్తారంటూ స్థానిక ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఎన్నికలకు ముందు నియోజకవర్గ ప్రజలకు కొన్ని హామీలను ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెబుతున్నా...ఆ దిశగా అడుగులు పడటం లేదు. అసలు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఇచ్చిన హామీలను ఒకసారి పరిశీలిస్తే...

- పెడన నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరిస్తా
- ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తా.
- చినపాండ్రాకలో పీహెచ్‌సీని అభివృద్ధి చేస్తా.
- ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తా.
- మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలన్నింటినీ ఇప్పిస్తా.
- అధునాతన బోట్లను అందజేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాటును అందిస్తా.
- బందరు పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలను స్థానికంగానే ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తా.
- నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తా.
- పెడనలో కలంకారీ పరిశ్రమ అవసరాల కోసం పదెకరాల భూమిని తీసుకుని వారికి వస్త్రాలు శుభ్రం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తా.
- కలంకారీ పరిశ్రమ కోసం టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తా.
- నియోజకవర్గంలో ఉన్న శివారు ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతా.
- నియోజకవర్గంలో రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తా.

పైన పేర్కొన్న ఏ ఒక్క హామీ పరిష్కారానికి ఈ వంద రోజుల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడడం లేదని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు.



ఎన్నికలకు ముందు ఆంధ్రజ్యోతి పత్రికలో ఇచ్చిన కాగిత కృష్ణప్రసాద్ ఇంటర్వ్యూ క్లిప్పింగ్

మాటలు కో'కొల్లు'లు.. చేతలు నిల్లు

- ఎన్నికల ముందు బందరు అభివృద్ధిపై అనేక హామీలిచ్చిన కొల్లు రవీంద్ర
- మంత్రి పదవి చేపట్టినా హామీల అమలు దిశగా కానరాని పాలన
- తీరప్రాంతాలకు ఇంటింటికీ కుళాయి లేదు
- బందరు పోర్టు మేజర్ పోర్టుగా అభివృద్ధి ఎప్పటికి...
- యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కడ

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల ముందు హామీలతో ఊదరగొట్టిన మాటల రవీంద్రుడు.. అధికారంలోకి వచ్చాక వాటి అమలును మరిచారు. ప్రజాశీస్సులతో ఎన్నికల్లో గెలిచి, రాష్ట్ర మంత్రి వర్గంలో కూడా చోటు పొందారు. దీంతో బందరు కష్టాలు తొలగిపోతాయని ప్రజలు భావించారు. కానీ వంద రోజుల పాలనలో ఒక్క హామీ ఆచరణకు కూడా అడుగు ముందుకు పడలేదు.

ఇచ్చిన హామీలివి...

ఎన్నికల సమయంలో కొల్లు రవీంద్ర పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని, ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగరంలో మురుగునీరు బయటకు పోయేలా శాశ్వత పరిష్కారం, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేస్తామని రైతులు ఇబ్బందులు పడకుండా సాగునీరు అందిస్తామని, కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. బందరు పోర్టును మేజర్ పోర్టుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలకు సబ్సిడీ విద్యుత్‌ను అందిస్తామని, సముద్రతీర ప్రాంతాల్లోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.


ఈ ఏడాది ఏప్రిల్ 7న మచిలీపట్నంలో నిర్వహించిన ప్రజాగళంలో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)

హామీలు అమలుకు ప్రయత్నమేది?

హామీలు అమలు జరిగేలా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలేవీ ఇంకా ప్రారంభం కాలేదని ప్రజలు అంటున్నారు. శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. వరదలు వచ్చి నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ఆ దిశగా తీసుకున్న చర్యలేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలు కూడా ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోజుల తరబడి లోతట్టు ప్రాంతాల్లో ముంపునీరు నిలిచినా తీసుకున్న చర్యలు శూన్యం అని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఆక్వాజోన్ ప్రాంతంలో రైతులకు సబ్సిడీ విద్యుత్ అందిస్తామన్న హామీ కూడా అమలుకాలేదు.

హామీల అమలుకు చర్యలు తీసుకోవాలి


కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఆ దిశగా నిధులు సమకూర్చి పనులు ప్రారంభించాలి. అన్ని హామీలను త్వరితగతిన అమలు చేయాలి.

– బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నాయకుడు

ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం


కూటమి ప్రభుత్వం విమర్శల నుంచి తప్పించుకునేందుకు వివిధ రకాల సమస్యలను సృష్టించి ప్రజలను మభ్యపెడుతోంది. రాజకీయాలు మాని ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– ఎగ్గోని గాంధీ, దళిత బహుజన పరిరక్షణ సంఘం

ఒక్క హామీ అమలైతే ఒట్టు

- స్థానిక మేనిఫెస్టో అంటూ ఎన్నికలప్పుడు ప్రచారం
- వంద రోజులైనా ఒక్క హామీ అమలు కాని వైనం

అవనిగడ్డ: '' తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ ధ్వంసం అయ్యాయి. పర్యాటక రంగం పూర్తిగా కుంటుపడింది. సాగు, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వారంగం కుదేలైంది. ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తాను. అవుట్ ఫాల్ స్లూయిస్‌ల పునర్నిర్మాణం, శిథిల సముద్రపు కట్ట, ఏటికట్టల నిర్మాణం, పులిగడ్డ అక్విడెక్టు పరిరక్షణ, ఘంటసాలలో శయన బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయడం, అవనిగడ్డలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ఎడ్లంక వారధి, ఎదురుమొండి వారధి, అవనిగడ్డలో డంపింగ్ యార్డు తరలింపు, మోపిదేవిలో శీతల గిడ్డంగి ఏర్పాటు'' వంటి హామీలతో మండలి బుద్ధప్రసాద్ స్థానిక మేనిఫెస్టో అంటూ ఎన్నికల సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఈ వంద రోజుల పాలనలో వాటి ఊసేలేదు.

పొలాల్లోకి ఉప్పునీరు చొచ్చుకొస్తోంది

కోడూరు మండలం పాలకాయతిప్ప వద్ద అవుట్ ఫాల్ స్లూయిస్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఇక్కడ గేట్లు లేకపోవడంతో ఇటీవల వచ్చిన వరదకు సమీపంలోని గ్రామాలను ముంచెత్తే ప్రమాదం ఉండటంతో ఇక్కడ గతంలో వేసిన అడ్డుకట్టలను తొలగించారు. ప్రస్తుతం ఈ ప్రాంతం నుంచి ఆటు పోటులకు సముద్రం నీరు 8 కి.మీ వరకూ రత్నకోడులోకి రావడంతో సమీపంలోని పొలాల్లో ఉప్పునీరు ముంచెత్తుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత అవుట్ ఫాల్ స్లూయిస్‌లు ఆధునీకరిస్తామని చెప్పిన బుద్ధప్రసాద్ సముద్రపు పోటు నీరు రాకుండా అరికట్టలేక పోవడంపై ఈ ప్రాంత రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అవనిగడ్డ - కోడూరు రోడ్డుని వదిలేశారు

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుగా ధ్వంసమైన తీర ప్రాంత రహదారులన్నీ వేయిస్తామని ఎన్నికల హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.16.80 కోట్లతో ప్రారంభించిన అవనిగడ్డ - కోడూరు రహదారి పనులను వంద రోజుల పాలనలో పూర్తి చేయలేకపోయారు. కోడూరు మండలం కె.కొత్తపాలెం, మాచవరం, రామచంద్రపురం వద్ద కొద్దిమేర మాత్రమే పనులు చేశారు. గతంలో వేసిన తొలి దశ రోడ్డు ఇటీవల వచ్చిన వర్షాలకు రాళ్లు లేచి దెబ్బతింది.



ఎన్నికల సందర్భంగా ఆంధ్రజ్యోతిలో వచ్చిన బుద్ధప్రసాద్ హామీల ఇంటర్వ్యూ

డంపింగ్‌యార్డు తరలింపు ఏది?

అవనిగడ్డ – నాగాయలంక రోడ్డులో ఉన్న డంపింగ్‌యార్డు తరలింపు గురించి గతంలో ప్రతిపక్షంలో ఉన్నపుడు తీవ్ర విమర్శలు చేసిన మండలి బుద్ధప్రసాద్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే లేదు.

తూతూ మంత్రంగా డ్రైనేజీ పనులు

ఒక్క ఎకరాకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తానని, ఒక్క ఎకరా కూడా ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో బుద్ధప్రసాద్ ఊదరగొట్టారు. రూ.5కోట్ల మేర డ్రైనేజీ, పంటకాలువ పనులు చేశారు. డ్రైన్లలో సరిగా గుర్రపుడెక్కను తొలగించక పోవడంతో ఇటీవల వచ్చిన వర్షాలకు చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో 38 వేల ఎకరాలకు పైగా వరిపంట ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

క్లుప్తంగా

గుంటూరు రాస్తా పనులకు శంకుస్థాపన

గూడూరు: తరకటూరు శివారు మాకులవానిపాలెంలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన గుంటూరు రాస్తా నిర్మాణ పనులకు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ డీఎంఎఫ్ నిధులతో ఒక కిలోమీటరు మేర జీఎస్‌పీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పాలనపై బ్రోచర్ల ఆవిష్కరణ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే ప్రజల చేత ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుంటుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. 100 రోజుల పాలనపై ఏర్పాటు చేసిన బ్రోచర్లు, స్టిక్కర్లను ఎమ్మెల్యే తరకటూరులో ఆవిష్కరించారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దారు డి.రాజేశ్వరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టాటా మోటార్స్ కర్వ్ ఎస్‌వీ కూపే కారు మార్కెట్‌లోకి విడుదల

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో టాటా మోటార్స్ షోరూమ్‌లో శుక్రవారం కర్వ్ ఎస్‌వీ కూపే కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ హేమంతరావు, రవాణాశాఖ కార్యాలయ ఏవో కవిత, చిలకలపూడి ఎస్ఐ బలరాం, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా గణేశ నిమజ్జనం

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని రామాలయంలో ఆవుల, ముమ్మారెడ్డి ముఠాల ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిసిన సందర్భంగా స్వామివారి నిమజ్జనోత్సవ ఊరేగింపు గ్రామంలో అట్టహాసంగా సాగింది. తొలుత ఆలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహం చేతిలో ఉంచిన 13.5 కేజీల లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించగా మండలంలోనే అధిక ధరగా రూ.46వేలు పలికింది. వేలంపాటలో లడ్డూను గ్రామానికి చెందిన కూనపరెడ్డి అంకాలరావు- రాధిక దంపతులు దక్కించుకున్నారు. ఉత్సవాల ఆరంభ సమయంలో దాత అర్జా శ్రీనివాసరావు-పద్మ దంపతులు లడ్డూను సమర్పించారు. ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని నాగాయలంక ఘాట్ వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. రెండు ముఠాల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరంలో పర్యటించిన కలెక్టర్

మచిలీపట్నంటౌన్: నగరంలోని బ్రహ్మపురంలో శుక్రవారం కలెక్టర్ డీకే బాలాజీ పర్యటించారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో వృద్ధురాలు వీర రాజేశ్వరి తన చేయి ఫ్యాక్చర్ అయిందని, సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నానని కలెక్టర్‌కు వివరించింది. వెంటనే ఆయన స్పందించి ఎన్టీఆర్ వైద్యసేవ కింద మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కో-ఆర్డినేటర్ సతీష్‌కుమార్‌ను ఆదేశించారు. గతంలో రెవెన్యూ ఉద్యోగులకు ప్రభుత్వం మార్కెట్ ధరకు కేటాయించిన స్థలాల్లో నివసిస్తున్న వారు, వారి వారసులు తమ ఇబ్బందులు కలెక్టర్‌కు వివరిస్తూ 22ఎ నిషేధిత జాబితాలో ఈ భూములు ఉన్నందున క్రయ విక్రయాలకు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సంబంధిత ఫైల్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జెడ్పీ సీఈవో ఆనందకుమార్, కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మొక్కలు నాటిన అధికారులు

కోడూరు: 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఉల్లిపాలెం, హంసలదీవి, లింగారెడ్డిపాలెం, మందపాకల, జయపురం, వి.కొత్తపాలెం, రామకృష్ణాపురం పంచాయతీల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి మొక్కలు నాటారు.

దివిసీమ విద్యాకుటుంబం అందరికీ ఆదర్శం

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అవనిగడ్డ: వరద బాధితులకు అండగా నిలచిన దివిసీమ విద్యా కుటుంబం మిగతా ప్రాంతాల వారందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి విద్యా కుటుంబం పేరుతో సమకూర్చిన రూ.30 లక్షల విరాళంతో మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకకు చెందిన 460 మంది వరద బాధితులకు కుక్కర్లు, వంటపాత్రలను శుక్రవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఈవో తాహెరా సుల్తానా అందించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో దెబ్బతిన్న గ్రామాల ప్రజలకు మిగిలిన గ్రామాల ప్రజలు తమ వంతు సహకారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారని చెప్పారు. డీఈవో తాహెరా సుల్తానా మాట్లాడుతూ విపత్తుల వేళ విద్యార్థుల భాగస్వామ్యాన్ని విదేశాల్లో మాదిరిగా పాఠ్యాంశంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకారావు, డీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్లు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మేడా బాబ్జి, తెలుగునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కై తేపల్లి దాస్, ఎంఈవోలు పిచ్చయ్య, రాందాస్, ప్రైవేటు విద్యాసంస్థల నేత సనకా నాగమునేశ్వరరావుతో పాటు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.


వంటపాత్రలు అందిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, డీఈవో తాహెరా సుల్తానా

రహదారి అభివృద్ధికి ఓఎన్‌జీసీ సంసిద్ధత


అవనిగడ్డ: నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెం నుంచి ఓఎన్‌జీసీ ప్లాంట్ వరకూ రహదారిని రూ.1.80 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఓఎన్‌జీసీ ముందుకొచ్చినట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఓఎన్‌జీసీ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే ఇంటివద్ద ఆయన్ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా 1.8 కి.మీ మేర రహదారిని నిర్మించేందుకు ఓఎన్‌జీసీ ముందుకొచ్చిందన్నారు. నంగేగడ్డ, వక్కపట్లవారిపాలెంలో సీఎస్ఆర్ నిధులతో తాగునీటి పథకాలకు మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు ఓఎన్‌జీసీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని కలసిన వారిలో ఓఎన్‌జీసీ సపోర్ట్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, సీజీఎం హెడ్‌లు టీవీ శేఖర్, రేపల్లె రామారావు, ఏరియా మేనేజర్ బి.రవిశేఖర్, ఆర్అండ్‌బీ డీఈ వరలక్ష్మి ఉన్నారు.

- **రెండు ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా**

పెదకళ్లేపల్లి(మోపిదేవి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చెరువులకు, డొమెస్టిక్‌కి వేరువేరుగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ పాండురంగారావు తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లి సబ్‌స్టేషన్‌లో రెండు ఫీడర్స్ ద్వారా విద్యుత్ సరఫరాను శుక్రవారం ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అవనిగడ్డ సబ్ స్టేషన్ మెయింట్‌నెన్స్ శుక్రవారం జరుగుతుందని, దీనివల్ల ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మండలంలోని మోపిదేవి, పెదకళ్లేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ పాండురంగారావు తెలిపారు.

- **గణపేశ్వరంలో స్వచ్ఛతా ప్రతిజ్ఞ**

గణపేశ్వరం(నాగాయలంక): స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం గణపేశ్వరం పంచాయతీ పరిధిలో అంగన్ వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయం ఆవరణలో తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత పంచాయతీ విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ గ్రామస్తులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచి బెల్లంకొండ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉపసర్పంచ్ విజయలక్ష్మి మొక్కలు నాటారు.

- **మూగ జీవాలకు పశువుల మేత సాయం**

శ్రీకాకుళం(ఘంటసాల): వరదల కారణంగా మేత లేక అల్లాడుతున్న మూగ జీవాలకు ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర నాయకులు తాడికొండ చిన్న, బావిరెడ్డి సుబ్రహ్మణ్యం కుమారులు వరిగడ్డి దానం చేశారు.కార్యక్రమంలో తమ్మన పవన్, జనసేన పార్టీ నేతలు కొల్లారి చిత్, మాదాసు వినయ్ పాల్గొన్నారు.

- **పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి**

ఘంటసాల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో కేజే శ్రీనివాస చంద్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఘంటసాల మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల ప్రాంగణాల్లో శుక్రవారం సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, అధికారులతో కలసి శుక్రవారం ఆయన మొక్కలు నాటారు.

- **బుసక మేట తొలగించేందుకు అనుమతి ఇప్పించండి**

ఘంటసాల: పంటలు పండించే లంక భూముల్లో బుసక మేట తొలగించుకునేందుకు అనుమతి ఇప్పించాలని కోరుతూ ఆదిఆంధ్ర ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ కమిటీ ఎస్సీ సభ్యులు శుక్రవారం తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ జుజ్జువరపు చంటి, కార్యదర్శి జి.వీరరాఘవులు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- **లంక భూములను పరిశీలించిన తహసీల్దార్**

తెలుగురావుపాలెం(ఘంటసాల): లంక భూముల్లో ఇసుక మేట వేసిన పొలాలను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. మండలంలోని తెలుగురావుపాలెం, శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లోని లంక భూములను తహసీల్దార్ విజయ ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శ్రీకాకుళం, పాపవినాశనంలో సుమారు 30 ఎకరాల్లో ఇసుక, బుసక మేట వేసి ఉన్నట్లు గుర్తించామన్నారు.

- **వెయ్యి నోటు పుస్తకాలు పంపిణీ**

గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి, ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఘట్టమనేని బాబూరావు సహకారంతో శుక్రవారం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్, మండల ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు రూ.40 వేల విలువైన 1000 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఘట్టమనేని మారుతీ ప్రసాద్, గుంటుపల్లి వెంకట రమణ, ఉప సర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, మాలెంపాటి వెంకట నరసింహారావు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు.

- **సర్వజన ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించండి**

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఈ మేరకు ఆయన ఆసుపత్రి డెప్యూటీ సూపరింటిండెంట్ రమేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్తంగా

- **డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్ పదవికి కర్రి ఏకగ్రీవం**

నాగాయలంక: స్థానిక మత్స్యకారుల మార్కెటింగ్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి నాగాయలంక నుంచి కృష్ణాజిల్లా మత్స్యకారుల సహకార సంఘం డైరెక్టర్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని లకనంతో పాటు, ఎంపీటీసీ సభ్యుడు లంకె శ్రీనివాసప్రసాద్ తదితరులు అభినందించి సన్మానించారు.

- **పాలకాయతిప్ప మెరైన్ సీఐగా సురేష్‌రెడ్డి**


కోడూరు: మండలంలోని పాలకాయతిప్ప మెరైన్ (కోస్టల్ సెక్యూరిటీ) పోలీస్‌స్టేషన్ సీఐగా రావి సురేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన వల్లభనేని పవన్‌కిషోర్ బదిలీపై విజయవాడకు వెళ్లడంతో సురేష్‌రెడ్డిని ఇక్కడ నియమించారు.

- **మోపిదేవి దేవస్థానంలో స్వచ్ఛతా హీ సేవ**

మోపిదేవి: మోపిదేవిలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, పెదకళ్లేపల్లిలో శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివార్ల దేవస్థానంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు నేతృత్వంలో ఉదయం ఆలయ అధికారులు, సిబ్బంది చీపుర్లు పట్టి కార్యాలయాలను శుభ్రం చేశారు.

- **గ్రామాల్లో సౌకర్యాలపై ప్రజలకు అవగాహన**

ఘంటసాల: గ్రామాల్లో ఉన్న అన్ని సౌకర్యాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి అన్నారు. స్థానిక బండి వారి రామాలయం వద్ద శుక్రవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు ఘంటసాల గ్రామ భాగస్వామ్య గ్రామీణ అంచనా పటం చిత్రాన్ని రంగు వల్లులతో గీసి గ్రామస్తులకు వివరించారు.

- **మత విద్వేషాలు రెచ్చగొడితే సహించేది లేదు**

పెడన: పెడన పట్టణంలో ఈ నెల 15న జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఈ సంఘటనపై సిట్ దర్యాప్తు బృందం విచారణ చేస్తోందని మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభానీ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన పెడన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ పెడన బస్టాండు సెంటర్ సమీపంలో ఈ నెల 15న ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగి పరస్పరం రాళ్ల దాడి చేసుకున్నారని, ఈ క్రమంలో ఒక కానిస్టేబుల్ తలకు గాయమైందని, పోలీసుల వాహనం అద్దం పగిలిందన్నారు. ఈ సంఘటనపై నిష్పక్షపాతంగా విచారణ కొనసాగుతోందని, బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వదంతులు నమ్మవద్దని, ఇరువర్గాలు సమన్వయం పాటించాల్సిందిగా సూచించారు. సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ సుభాష్, సీఐలు పాల్గొన్నారు.

- **వరిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి**

యండకుదురు(ఘంటసాల): వరి పంటలో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతిర్మయి అన్నారు. ఘంటసాల మండలం యండకుదురు గ్రామంలో పంట పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించి రైతులకు జాగ్రత్తలు సూచించారు.

- **తడి, పొడి చెత్తపై అవగాహన**

పెడన: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా 7వ వార్డు మార్కెట్ యార్డు ఎదురు వీధిలో శుక్రవారం తడి చెత్త -పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, కౌన్సిలర్ కటకం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- **చిరుద్యోగులను తొలగించొద్దు**

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధి హామీ పథకంలో ఫీల్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న చిరుద్యోగులను రాజకీయ కారణాలు, ఆరోపణలతో తొలగించటం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు.

- **ప్రజల మన్ననలందుకుంటున్న కూటమి ప్రభుత్వం**

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అందరి మన్ననలు అందుకుంటుదని చెప్పారు. అనంతరం పంచాయతీ ప్రాంగణంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు.

- **పంచాయతీలకు పునరుజ్జీవం**

కోడూరు: పంచాయతీ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం పోసిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండలంలోని మాచవరం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేసి, ఇంటి గోడలకు స్టిక్కర్లను అంటించారు. ఎంపీడీఓ ఆర్.శ్రీనివాసరావు, ఎంఈఓ రామదాసు, ఈఓపీఆర్డీ నాగరేవతి, సర్పంచి అప్పికట్ల లక్ష్మి, కూటమి నేతలు పాల్గొన్నారు.